సాక్షి
నల్లగొండ
మంగళవారం । 14 । ఫిబ్రవరి । 2023



విచారణ జరిపించాలి
అదానీ కుంభకోణాలపై వెంటనే విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. - 8లో



చట్టబద్ధత కల్పించాలి
ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ అన్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం 34°/14°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రి చలి అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పోడు పట్టాల పంపిణీకి సిద్ధంకండి : కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నల్లగొండ రూరల్: పోడు భూముల పట్టాల పంపిణీకి అధికారులు సిద్ధం కావాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పోడు భూములపై అటవీ, రెవెన్యూ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు అమలు చేయాలన్నారు. ఈ మేరకు అర్హులైన వారికి హక్కు పత్రాలు అందజేయనున్నట్లు సూచించారు. ఈ సమావేశంలో టీఎఫ్‌ఓ రాంబాబు, ఆర్డీఓ చెన్నయ్య, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి
నల్లగొండ: ప్రజావాణిలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుతో కలిసి ఆయన హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి మాట్లాడారు. వచ్చిన అర్జీలు పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహించాలి


మాట్లాడుతున్న దస్రూనాయక్

నల్లగొండ: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, డీఈసీ కన్వీనర్ దస్రునాయక్ అన్నారు. సోమవారం ఇంటర్ జిల్లా పరీక్షల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండలోని ప్రభుత్వ లెక్చరర్ల అసోసియేషన్ భవనలో ప్రాక్టికల్ ఎగ్జామినేషన్ సెంటర్స్ చీఫ్ సూపరింటెండెంట్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రాక్టికల్ పరీక్షలు మార్చి 2వ తేదీ వరకు నిర్వహిస్తూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు , మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో బాలూనాయక్, నరేందర్‌కుమార్, ఇస్మాయిల్, ధన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సబ్బండ కులాలకు రాజ్యాధికారం దక్కాలి


మాట్లాడుతున్న విశారదన్ మహరాజ్

త్రిపురారం: సబ్బండ కులాలను రాజ్యాధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పాదయాత్ర చేపట్టానని దళిత శక్తి ప్రోగ్రాం (డీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. అణగారిన వర్గాలకు రాజ్యాధికార సాధన కోసం ఆయన చేపట్టిన పదివేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర సోమవారం త్రిపురారానికి చేరుకున్న సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి, డీఎస్పీ జెండా ఎగురవేశారు. అనంతరం రాగడప, పెద్దదేవులపల్లి, కంపాసాగర్ గ్రామాల్లో సాగిన పాదయాత్రలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు రాంబాబు, బీసీ నాయకులు నాగరాజు, వంగాల సతీష్ గౌడ్, ఎరుకల రామకృష్ణ గౌడ్, పాతనబోయిన శ్రీనివాస్, బైరం జార్జ్, రవికుమార్, శ్రీకాంత్, శ్రీను, శంకర్ బౌద్ధ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

టీసీసీ పరీక్షలు ప్రారంభం

రామగిరి(నల్లగొండ): జిల్లా కేంద్రంలో సోమవారం ఏడు కేంద్రాల్లో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ విభాగాల్లో లోయర్, హయ్యర్ గ్రేడ్స్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యా హ్నం ఒంటిగంటల వరకు జరిగిన పరీక్షకు 680 మంది విద్యార్థులకు గాను 270 మంది హాజరుకాగా 410 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరిగిన పరీక్షకు 600 మందికి 230 మంది హాజరుకాగా 370 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఈఓ భిక్షపతి సందర్శించి తనిఖీలు చేశారు.

కోతలు.. అవస్థలు

వ్యవసాయానికి 6 నుంచి 8 గంటలే విద్యుత్ సరఫరా

- ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియడం లేదంటున్న రైతులు
- అప్రకటిత విద్యుత్ కోతలతో వరికి అందని సాగు నీరు
- కరెంట్ కోసం రాత్రి వేళల్లో తప్పని పడిగాపులు
- చేతికొచ్చే దశలో ఎండుతున్న చేలు


మునుగోడు మండలం కల్వలపల్లిలో ఎండుతున్న వరిచేను



రాత్రిపూట పొలం వద్ద మంచంపై కూర్చున్న ఈ రైతు చందంపేట మండల కేంద్రానికి చెందిన బోడ లక్ష్మీనారాయణ. ఆయనకున్న ఐదెకరాల్లో వేరుశనగ సాగు చేశారు. మరో 15 రోజుల్లో పంట చేతికొస్తుందనుకున్న తరుణంలో విద్యుత్ కోతలతో పంటకు నీరందించేందుకు అష్టకష్టాలు పడుతున్నాడు. పది రోజుల నుంచి కరెంట్ సరిగ్గా ఉండటంలేదని, దీంతో పంటకు నీరు పెట్టేందుకు రాత్రిళ్లు కావలి ఉంటున్నాడు. ఒకసారి రాత్రి 11 గంటలకు కరెంట్ వస్తే మరోసారి అర్ధరాత్రి 2 గంటల సమయంలో కరెంట్ వచ్చాక నీటిని పెట్టాల్సి వస్తుందని వాపోయారు.



టార్చ్ లైట్ పెట్టుకొని రాత్రి 11 దాటాకా పంట పొలానికి నీరుపెడుతున్న ఈ రైతు పేరు రమావత్ కోట్య. కొండమల్లేపల్లి మండలంలోని జానిగానితండాకు చెందిన ఈయన తనకున్న రెండెకరాల్లో వరి, మరో ఎకరంలో జొన్న పంటలు సాగు చేశాడు. పగటి వేళలో కరెంట్ ఉండడం లేదని, వచ్చినా లోఓల్టేజీతో మోటార్లు కాలిపోయే పరిస్థితి ఏర్పడిందని, పంటలు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితి ఆ ఇద్దరు రైతులదే కాదు. సమయ పాలన లేని విద్యుత్తు సరఫరాతో జిల్లాలో అనేక మంది రైతులు పడుతున్న ఇబ్బందులకు తార్కాణం.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరాను పురరిద్ధరిస్తున్నామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించినా అప్రకటిత కోతలు ఆగడం లేదు. ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని కరెంట్‌తో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఫలితంగా రాత్రింబవళ్లు పంట పొలాల వద్ద కరెంట్ కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. విద్యుత్ సరఫరా సరిగ్గా లేక పంటలు ఎండిపోతుండటంతో రైతులకు ఆందోళన తప్పడం లేదు. జిల్లాలో అస్తవ్యస్త విద్యుత్ సరఫరాతో రైతులు పడుతున్న ఇబ్బందులపై ఆదివారం రాత్రి, సోమవారం జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన గ్రామాల్లో సాక్షి గ్రౌండ్ రిపోర్ట్ నిర్వహించింది.

పగటి వేళల్లోనూ ఉండని కరెంట్
రాత్రి వేళల్లోనే కాదు కనీసం పగటి వేళల్లోనూ విద్యుత్ సరఫరా సరిగ్గా లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పగలు లోఓల్టేజీ సమస్య కారణంగా మోటార్లు కాలిపోతాయోనని భయపడాల్సి వస్తుందని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో పంట పొలాలకు నీరు పెట్టుకునేందుకు నిద్ర మానుకొని రాత్రి వేళల్లో పొలాల వద్దే పడుకోవాల్సి వస్తుండగా, పొద్దంతా కరెంటు వచ్చినప్పుడే పొలాల వద్దకు తిరుగాల్సి వస్తోందని వెల్లడించారు.

ఎప్పుడు వస్తుందో... ఎప్పుడు పోతుందో..
జిల్లాలో సమయపాలన లేకుండా విద్యుత్తు సరఫరాలో కోతలు తప్పడం లేదు. ఒక ప్రాంతంలో పగటిపూట త్రిఫేజ్ కరెంట్ ఉంటే మరో ప్రాంతంలో కరెంట్ ఉండడం లేదు. వ్యవసాయానికి 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని ప్రభుత్వం చెబుతున్నా పగటిపూట విద్యుత్ లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. భూగర్భ జలాలు పెరిగి బోరు బావుల ద్వారా సాగు నీరు అందుతున్నా కరెంట్ సరఫరాలో అంతరాయంతో ఇబ్బంది పడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే ఎండా కాలంలో మరింత ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందేమోనని అంటున్నారు.

విడతల వారీగా అంటున్నా..
వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఎలాంటి కోతలు లేవని అధికారులు చెబుతున్నారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కోరకంగా విడతల వారీగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని పేర్కొంటున్నారు. కొన్ని చోట్ల రాత్రి 11 గంటల నుంచి తెలవారుజామున 5 గంటల వరకు, మరికొన్ని చోట్ల ఉదయం 5 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు త్రిఫేజ్ కరెంట్ ఇస్తున్నామని పేర్కొంటున్నారు.

పది రోజుల నుంచి సమస్య



"నాలుగు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. పది రోజుల నుంచి విద్యుత్ సరఫరాలో ఇబ్బంది తప్పడం లేదు. రాత్రి పూట కరెంట్ ఎప్పుడు వస్తుందో చూసుకొని మోటారు ఆన్ చేసుకోవాల్సి వస్తుంది. దీంతో పంట పొలం వద్దనే గడపాల్సి వస్తోంది.
- మూడావత్ పత్య, గట్టుకిందితండా, చందంపేట మండలం

ఇబ్బంది పడుతున్నాం



"విద్యుత్ కోతలతో 10 రోజులుగా ఇబ్బంది పడుతున్నాం. రాత్రి కండిమీద కునుకు లేకుండా పోతోంది. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక తంటాలు పడాల్సి వస్తోంది.
- మోదుగు సత్తి రెడ్డి, గట్టుప్పల

కొన్ని మండలాల్లో పరిస్థితి..
- చింతపల్లి మండలంలో 30 వేల ఎకరాల్లో వరి, 2,500 ఎకరాల్లో మొక్కజొన్న, కూరగాయలు, ఇతర పంటలు సాగు చేస్తున్నారు. వరి పొలాలకు ప్రస్తుతం నీటి అవసరం ఉండగా కరెంట్ కోతలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఇటీవల త్రీఫేజ్ సరఫరాపై ఆంక్షలు మొదలు కావడంతో రోజులో 10 నుంచి 13 గంటలు, అదీ ఎప్పుడు వస్తుందో పోతుందో తెలియడం లేదని రైతులు వాపోతున్నారు.
- చండూరు మండలంలో విద్యుత్ సరఫరాలో సమస్యలతో ఇబ్బంది పడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. రాత్రి 11 గంటలకు త్రీఫేజ్ కరెంట్ వస్తుందని, తరువాత గంటన్నరకే పోతుందని, ఆ తరువాత ఎప్పుడు వస్తుందో తెలియక అక్కడే వేచి ఉండాల్సి వస్తోందని చెబుతున్నారు. ఆటోమెటిక్ స్టార్టర్లు పెట్టినా ఒక్కోసారి అవి పని చేయక ఇబ్బంది పడాల్సి వస్తోందని చెబుతున్నారు.
- మర్రిగూడ మండలంలో పది రోజులుగా ఏ సమయం నుంచి ఏ సమయం వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెకొంది. ఒక్కో గ్రామంలో ఒక్కోరోజు ఒక్కో రకంగా సరఫరా అవుతోంది. రోజులో మొత్తానికి 6నుంచి 8గంటలే త్రీఫేజ్ విద్యుత్ వస్తోందని, దీంతో పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు.

ప్రేమ బంధం.. నిలవాలి కలకాలం

- ప్రేమ పెళ్లి తర్వాత విడిపోతున్న జంటలు
- న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదులు



నల్లగొండ రూరల్: ప్రేమకు కులం, మతం, ఆర్థిక ఇబ్బందులేవీ అడ్డంకిగా ఉండడం లేదు. కానీ కొందరు ప్రేమ వివాహం చేసుకున్న రెండేళ్ల వరకు అన్యోన్యంగా ఉన్నప్పటికీ పిల్లలు పుట్టిన తర్వాత ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ ఘర్షణకు పాల్పడుతున్నారు. స్థిరపడిన ప్రేమ వివాహాల్లోనూ భిన్న అభిప్రాయాలు, విభేదాలు లేకపోలేదు. తెలిసీతెలియని వయస్సులో చేసుకున్న ప్రేమ వివాహాల్లో అనేక చిక్కుముళ్లు ఏర్పడి తిరిగి మోసపోయామని తల్లిదండ్రుల వద్దకు చేరిన వారు కొందరైతే, పోలీసులను ఆశ్రయించిన వారు మరి కొందరు ఉంటున్నారు. కులాంతర వివాహాల్లో హత్యలు, ఆత్మహత్యలు ఉన్నాయి. ఆర్థిక అసమానతలు ఇరు కుటుంబాల మధ్య విభేదాలు మరింత పెద్దవిగా మారుతూ కోర్టు మెట్లెక్కుతున్నారు. మొత్తంగా ప్రేమించి పెళ్లి చేసుకుంటే ఆ బంధం మోసపూరితం కావొద్దని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

భరోసా సెంటర్‌ను ఆశ్రయించి
జిల్లా వ్యాప్తంగా ప్రేమ వివాహాలతో మోసపోయామని అనేకమంది భరోసా సెంటర్‌ను ఆశ్రయించారు. 2021లో 180, 2022లో 214 మంది మోసపోయామని ఫిర్యాదు చేశారు.

స్థిరపడిన తర్వాతే పెళ్లి చేసుకోవాలి



వివాహ బంధం ఏదైనా జీవితంలో స్థిరపడిన తర్వాతనే పెళ్లి చేసుకోవాలి. తెలిసీతెలియని వయసులో ప్రేమ వివాహాలతో వచ్చే ఇబ్బందులను అధిగమించడం స్థిరపడకపోతే ఇబ్బందులు ఉంటాయి. ఉన్నత విద్య పూర్తి చేసిన తర్వాత స్థిరపడడం సులభంగా ఉంటుంది. సెటిల్ కాక మోసపోయామనే బాధ పడకూడదు. కుటుంబ సభ్యులను మెప్పించి వివాహం చేసుకోవాలి.
- అపూర్వరావు, నల్లగొండ ఎస్పీ

మోసపోయామని ఫిర్యాదులు



ప్రేమ సమయంలో అన్యోన్యతగా ఉన్నట్లుగా వివాహం అయిన తర్వాత కలిసి ఉండడం లేదు. మెచ్యూరిటీ లేకపోవడం ఇద్దరి మధ్య పరిచయం, ఆకర్షణతో స్థిరపడకుండానే తెలియని వయసులో వివాహం చేసుకుంటున్నారు. రోజూ స్టేషన్‌కు వచ్చే పదింటిలో 6 ఫిర్యాదులు మోసపోయాను.. నాకు అబ్బాయి వద్దు అని విభేదిస్తున్నారు. ఇరు పక్షాల కుటుంబ సభ్యులు సహకరించకపోగా వారిని విడదీసేందుకే అంతర్గతంగా ప్రయత్నాలు చేస్తున్నారు.
-ఆదిరెడ్డి, సీఐ, మహిళా పోలీస్‌స్టేషన్

తొందరపాటు నిర్ణయాలతోనే..



తొందరపాటు నిర్ణయాలతో ప్రేమ వివాహాలు చాలా వరకు విఫలం అవుతున్నాయి. జీవితంలో స్థిరపడకుండా ఆర్థికంగా నిలదొక్కుకోకముందు వివాహాలు చేసుకోవడంతో విఫలం అవుతున్నాయి. తల్లిదండ్రులకు దూరంగా హాస్టల్‌లో ఉంటూ చదువు కోవడం ఎక్కువగా ఫోన్ వినియోగంతో మోసపోతున్నారు. తల్లిదండ్రుల నియంత్రణ లేకుండా పోతుంది. ప్రేమించుకనే రోజుల్లో కలిసి ఉన్నప్పటికీ వివాహం అనంతరం వారి బంధం ఆసక్తి తగ్గిపోయి వివాదాలకు కారణమవుతున్నాయి. ఎక్కువగా అబ్బాయిలు స్థిరపడకపోవడమే ప్రేమ వివాహాలన్నీ ఫేయిల్ అవుతున్నాయి.
-రాజశేఖర్, సీఐ, నల్లగొండ

కేసీఆర్ నాయకత్వం అవసరం


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ, ఎమ్మెల్యేలు తదితరులు

- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

కేతేపల్లి: తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలను చూసి దేశమంతా కేసీఆర్‌ను కోరుకుంటుందని, దేశానికి ఆయన నాయకత్వం అవసరమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. కేతేపల్లిలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యలతో కలిసి సోమవారం సాయంత్రం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని అభివృద్ధి, సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని చెప్పారు. నిత్యం ప్రజల్లో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను వచ్చే ఎన్నికల్లో మరోసారి భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరిన పలువురు వార్డు సభ్యులకు మంత్రి పార్టీ కండవాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, కేతేపల్లి జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలతసురేష్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు బంటు మహేందర్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు బడుగుల శ్రీనివాస్‌యాదవ్, కేతేపల్లి ఎంపీటీసీ ఎర్రైబోయిన వెంకన్న, టీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం వెంకట్‌రెడ్డి, చిమట వెంకన్న, మహిళా మండల అధ్యక్షురాలు ఎం.విజయరాణి, పలు గ్రామాల సర్పంచ్‌లు ఉన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి కృషి

మిర్యాలగూడ టౌన్: కేసులు సత్వరం పరిష్కరిస్తూ కక్షిదారులకు తగిన న్యాయం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని జిల్లా 5వ అదనపు న్యాయ మూర్తిగా కె.కవిత అన్నారు. సోమవారం ఆమె మిర్యాలగూడ కోర్టులో బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఆర్.రఘునాథరెడ్డి మల్కాజ్‌గిరి మొదటి అదనపు కోర్టు జిల్లా న్యాయ మూర్తిగా బదిలీ కాగా ఆయన స్థానంలో కవిత మిర్యాలగూడకు వచ్చారు. నూతన న్యాయమూర్తి కవితకు మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సినియర్ సివిల్ జడ్జి సీహెచ్ ఆశాలత, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.స్వర్ణలత, అదనపు జూనియర్ సివిల్ జడ్జి బీఎస్ఎన్ సుమబాల, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎం.రాజేష్ ఉన్నారు.

పెద్దలు కుదిర్చిన పెళ్లే ముద్దు!

- ప్రేమ వివాహాలపై మక్కువ చూపని విద్యార్థినులు
- ఒకరినొకరు అర్థం చేసుకుంటేనే ప్రేమ ఎంతో మధురం
- స్థిరపడ్డాకే వివాహానికి ఓకే చెప్పాలి
- 'సాక్షి' డిబేట్‌లో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల స్టూడెంట్స్ మనోగతం


మహిళా డిగ్రీ కాలేజీలో డిబేట్‌లో పాల్గొన్న విద్యార్థినులు

సాక్షి డిబేట్



నల్లగొండరూరల్: ప్రేమ వివా హాలపై విద్యార్థినులు మక్కువ చూపడం లేదు. 'ప్రేమ పెళ్లి వద్దు..పెద్దలు కుదిర్చిన పెళ్లే ముద్దు.. ప్రేమ, పెద్దలు కుదిర్చిన వివాహ బంధం ఏదైనా సరే రాజీ ధోరణి ఉంటే జీవితం ముందుకు సాగుతుంది.. అందుకే పరస్పరం అవగాహన అవసరం.. జీవితంలో స్థిరపడిన తర్వాతనే వివాహాలు చేసుకోవాలి' అని విద్యార్థులు అంటున్నారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా 'పెళ్లికి ముందు ప్రేమ –పెళ్లి తర్వాత ప్రేమ' అనే అంశంపై సోమవారం నల్లగొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన డిబేట్‌లో విద్యార్థినులు తమ మనోగతాన్ని వెల్లడించారు. తెలిసీతెలియని వయసులో ప్రేమలో పడి కుటుంబ సభ్యులను ధిక్కరించి చేసుకున్న వివాహ బంధాల్లో అనేక సమస్యలు ఎదురవుతాయన్నారు. చిన్న వయస్సులో ప్రేమ వివాహం చేసుకున్నాక కట్నకానుకలు, కుల ప్రస్తావన రావడంతో జీవితాలు గందరగోళంలో పడతాయని అభిప్రాయ పడ్డారు. పెద్దలు కుదిర్చిన వివాహ బంధంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని, ఏదైనా సమస్య వస్తే ఇరు కుటుంబాలు అండగా నిలుస్తారని, అప్పుడే జీవితం సాఫీగా సాగుతుందని అంటున్నారు. విద్యార్థుల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

మనసులు కలిసిన మనువు | 8లో

ఒకరినొకరు అర్థం చేసుకోవాలి



ఎలాంటి వివాహ బంధమైన ఒకరినొకరు అర్థం చేసుకుంటే ఎటువంటి సమస్యలు రావు. పెళ్లి సమయంలోనే ఎవరి విధానం ఏంటో స్పష్టంగా తెలిసిన తర్వాత ముందడుగు వేయాలి.
- శ్రీజ

కుటుంబాల సహకారం ఉండాలి



కుటుంబ సభ్యుల సహకారంతోనే వివాహ బంధం ఏర్పర్చుకోవాలి. ప్రేమ వివాహాలు ఎక్కువగా నిలువడం లేదు. ప్రేమ వివాహాలు జరిగి అనేక ఇబ్బందులు పడుతున్నారు.
- ఏఎం.జోష

తల్లిదండ్రుల సహకారం ఉండాలి



పెద్దలు కుదిర్చిన వివాహంలో ఇబ్బందులు ఉండవు. ఒకవేళ సమస్యలు వచ్చినా వాటిని పరిష్కరించేందుకు ఇరువైపుల నుంచి చొరవ చూపుతారు. ప్రేమ పెళ్లి చేసుకుంటే తల్లిదండ్రుల సహకారం ఉండాలి.
- దివ్య

ముందు సెటిల్ కావాలి



ఉన్నత విద్య పూర్తయిన తర్వాత జీవితంలో స్థిరపడాక వివాహం చేసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ప్రేమ వివాహంలో కుటుంబ సభ్యుల అంగీకారం ఉంటేనే మంచిది. లేకుంటే జీవితాంతం ఇబ్బందులు పడాల్సి వస్తుంది. - లక్ష్మీప్రియ

వరకట్నం బాధ తొలగాలి



పెద్దలు కుదిర్చిన వివాహం చేసుకున్నాను. అబ్బాయి కుటుంబ నేపథ్యాన్ని మా తల్లిదండ్రులు పూర్తిగా తెలుసుకొని వివాహ బంధం ఏర్పరిచారు. వరకట్నం బాధలు తొలిగిపోవాలి. - శారద

ప్రేమ పెళ్లిలో అనర్థాలే ఎక్కువ



ప్రేమ వివాహాలు చేసుకుంటే అనార్థాలే ఎక్కువగా ఉంటాయి. వీటన్నింటినీ మనం ఇప్పుడు సామాజిక మాధ్యమాల ద్వారా చూస్తూనే ఉంటున్నాం. ప్రేమ వివాహాల్లో కులం కూడా అడ్డుకట్టగా నిలుస్తుంది. - అంజలి విద్యార్థిని

కుటుంబ సభ్యులకు బాధ



అల్లారు ముందుగా పెంచిన అమ్మాయిలు ప్రేమ వివాహాలు చేసుకొని కుటుంబ సభ్యులను బాధ పెట్టొద్దు. కుటుంబ సభ్యులనే ఒప్పించి లేదా.. వారు అంగీకరిస్తే పెళ్లికి ఓకే చెప్పాలి. - రేష్మ

కట్నం లేకుండా చేసుకోవాలి



వివాహ బంధంలో పిల్లలై తర్వాత కట్నం కోసం ఇబ్బందులు పెట్టొదు. పెళ్లికి ముందు ప్రేమించినట్లుగానే వివాహ తర్వాత కూడా ప్రేమగా ఉండాలి. వివాహ వయస్సు 22 ఏళ్లకు పెంచితే మానసిక పరిపూర్ణత ఉంటుంది. జీవితంలో స్థిరపడడంపై అవగాహన ఉంటుంది.
- రాజారాం, కళాశాల లైబ్రేరియన్

పెద్దలు కుదిర్చిన వివాహమే బెటర్



పెద్దలు కుదిర్చిన వివాహం అయితేనే వివాహ బంధం బలంగా ఉంటుంది. ప్రేమ వివాహాలతో అనేక సమస్యలు ఏర్పడతాయి. ఏదైనా సమస్య వస్తే కుటుంబ సభ్యులు సపోర్టుగా నిలుస్తారు. తల్లిదండ్రులను గౌరవించి వివాహం చేసుకుంటే మంచిది.
- మిస్కిన్ తరుణం, అధ్యాపకురాలు

క్లుప్తంగా

కల్నల్ సంతోష్ బాబు సేవలు మరువలేనివి



సంతోష్‌బాబు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తల్లాడ వెంకటేశ్వర్లు

సూర్యాపేట : దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన బిక్కుమళ్ల కల్నల్ సంతోష్ బాబు చేసిన సేవలు మరువలేనివని రిటైర్డ్ టీచర్ సంతోష్ బాబు మామ తల్లాడ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కోర్టు చౌరస్తా వద్ద గల సంతోష్ బాబు 39వ జయంతి సందర్భంగా కల్నల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం తెగించి ప్రాణ త్యాగం చేసి ఎందరో సైనికులను రక్షించారన్నారు. కార్యక్రమంలో తల్లాడ ఉమ పాల్గొన్నారు.

బైక్ ఢీకొని గొర్రెల కాపరి మృతి

బీబీనగర్: బైక్ ఢీకొని గొర్రెల కాపరి మృతిచెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీబీనగర్‌కు చెందిన గొర్రెల కాపరి బాలయ్య(65) రోజులాగే తన మూగజీవాలను మేపేందుకు ఆదివారం ఉదయం వెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇంటికి రాకపోవడంతో అతని కోసం బాలయ్య కుమారుడు రామాంజనేయులు వెతకగా బీబీనగర్ సమీపంలోని జాతీయ రహదారి పక్కన విగత జీవుడిగా పడి ఉండడాన్ని గుర్తించాడు. అనంతరం రామాంజనేయులు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. జనగామకు చెందిన శివ ద్విచక్రవాహనాన్ని అతి వేగంగా నడుపుతూ బాలయ్యను ఢీకొట్టడంతో మృతిచెందినట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి



రాజారావు (ఫైల్)

తిరుమలగిరి (తుంగతుర్తి) : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలగిరి మండలం మామిడాల గ్రామానికి చెందిన దంతాలపల్లి రాజారావు (35) గత శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై మామిడాల నుంచి తిరుమలగిరికి వస్తుండగా వెలిశాల గ్రామ సమీపంలో కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యా యి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని తెలిపారు.

గూడ్స్ రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

పాలకవీడు: గూడ్స్ రైలు ఢీకొని మతిస్థిమితం లేకి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని జాన్‌పహాడ్ రైల్వే ఫైలోవర్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జాన్‌పహాడ్ గ్రామానికి చెందిన కొప్పుల వీరభద్రం(26)కు మతిస్థిమితం సరిగాలేదు. తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోవడంతో అన్నవద్ద ఉంటూ పశువులను కాసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామ సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద ట్రాక్‌పై వీరభద్రంను గూడ్స్ రైలు ఢీకొన్నట్లు స్థానికులు గుర్తించారు. వెంటనే స్థానిక పోలీసులు, రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేకుకుని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. ఫ్లైఓవర్ వద్ద ఫెన్సింగ్, ప్రమాద హెచ్చరికలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మనసులు కలిసిన మనువు

- ప్రేమ వివాహాలు చేసుకుని సంతోషంగా జీవిస్తున్న జంటలు
- జీవితంలో నిలదొక్కుకుని పలువురికి ఆదర్శం

నేడు 'వాలంటైన్స్ డే'

ప్రేమించి పెళ్లి చేసుకోవడం ఒక భాగమైతే.. ఆ ప్రేమను నిలబెట్టుకుని జీవితాంతం కలిసి ఉండడం మరో భాగం. అన్నీ వాకబు చేసి పెద్దలు కుదిర్చిన పెళ్లిల్లు కూడా కొన్నిసార్లు విడిపోయిన సందర్భాలు ఉన్న ఈ రోజుల్లో ప్రేమించి.. పెద్దలను ఒప్పించి కొందరు.. స్నేహితుల తోడ్పాటుతో మరికొందరు ప్రేమ వివాహాలు చేసుకుని సుఖ సంతోషాలతో జీవితం గడుపుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.



పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుని..

బీబీనగర్ : బీబీనగర్ మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన జక్కి నగేష్, మోటకొండూరు మండల కేంద్రానికి చెందిన మమతతో 2014లో భువనగిరిలోని ఎస్ఎల్ఎన్ఎస్ ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ చదువుతున్న సమయంలో పరిచయం ఏర్పడింది. తర్వాత ప్రేమగా మారింది. విద్యార్థి సంఘం కార్యక్రమాల్లో కలిసి పని చేయడంతో ఒకరినొకరం అర్థం చేసుకున్నారు. ఇద్దరూ ఎంఏ, బీఈడీ పూర్తి చేశాక వివాహం చేసుకోవాలనుకున్నారు. పెద్దలను ఒప్పించి 2020లో వివాహం చేసుకున్నారు. పెద్దలు ఒప్పుకున్నప్పటికీ ఎలాంటి కట్న కానుకలు లేకుండా వివాహం చేసుకొని ఆదర్శంగా నిలిచారు. ఈరోజు ఇద్దరూ సంతోషంగా జీవనం గడుపుతున్నారు.



నగేష్, మమత దంపతులు

సమాజ సేవే ఒక్కటి చేసింది



ఏటి.కృష్ణ రాధిక దంపతులు

డిండి : మండల కేంద్రానికి చెందిన ఏటి.కృష్ణ, మహేశ్వరం రాధిక మనస్సులు సేవాభావంతో కలిసి పోవడంతో ఒకరినొకరు ప్రేమించుకున్నారు. వీరి కులాలు వేరుకావడంతో పెద్దలు పెళ్లికి ఒప్పుకోలేదు. కానీ భవిష్యత్‌లో సమాజానికి సేవ చేయాలనే పట్టుదలతో పెద్దలను ఎదిరించి 2015 మే 21న రంగారెడ్డి జిల్లా పరిగి సమీపంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో వివాహం చేసుకున్నారు. వివాహం జరిగిన సంవత్సర కాలం తర్వాత డిండికి వచ్చారు. అప్పటి నుంచి ఏ విషయంలోనైనా వారు ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకుంటూ సాఫీగా జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం స్థానికంగానే ఉంటూ కృష్ణ బీజేపీ దేవరకొండ అసెంబ్లీ కన్వీనర్‌గా, రాధిక డిండి-1 ఎంపీటీసీగా కొనసాగుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

ఉద్యమం కలిపింది.. ఇద్దరిని



పిల్లలతో అనిల్, అనిత దంపతులు

మోత్కూరు : తెలంగాణ ఉద్యమం ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులను ఒక్కటి చేసంది. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని మర్రి అనిల్, నర్సంపేట జిల్లా దుగొండి మండలం తోగ రామయ్యపల్లికి చెందిన ఉడుత అనిత ఎంఏ చదువుతూ.. పీడీఎస్‌యూ నాయకురాలిగా పని చేస్తున్న సమయంలో.. యూనివర్సిటీలో తెలంగాణ విద్యార్థి జేఏసీ అధ్యక్షుడిగా ఉన్న అనిల్‌తో పరిచయం ఏర్పడింది. వారి పరిచయం ప్రేమగా మారింది. ప్రస్తుత తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్.. అనిత, అనిల్ పరిచయాలు, వీరి అతి చనువును తెలుసుకుని వారిని ఒక్కటి చేయాలని నిర్ణయించారు. వీరి ప్రేమ వివాహానికి అనిత తల్లిదండ్రులు అభ్యంతరం తెలుపడంతో ఎట్టకేలకు వారిని ఆమె ఒప్పించింది. హైదరాబాద్ మల్లాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో 2015 జూన్ 15న వీరి వివాహం జరిగింది. ఇరువురి తల్లిదండ్రులతో పాటు బంధువులు హాజరయ్యారు. వీరి వివాహ ఖర్చులకు సీఎం కేసీఆర్ రూ.లక్ష అందజేశారు. ఎమ్మెల్యే ఈటల రాజేందర్ వివాహ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. యూనివర్సిటీ విద్యార్థి నేతలు, తెలంగాణ ఉద్యమ నాయకులు వీరి వివాహానికి హాజరయ్యారు. వివాహానికి ముందు అనిత 2013లో కొడకండ్ల మోడల్ స్కూల్‌లో టీచర్‌గా జాయిన్ అయి విధులు నిర్వహిస్తున్నారు. అనిల్ ప్రస్తుతం బీఆర్ఎస్ క్రియాశీలక రాజకీయాల్లో చురుకుగా పని చేస్తున్నారు. వీరికి పాప వేదాగ్రిని, బాబు అశ్విత్ సంతానం. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో కేసులు, జైలు జీవితం అనుభవించి స్వరాష్ట్రంలో సరైన గుర్తింపు, పదవులు పొందలేక పోయామని తీవ్ర ఆవేదన, అసంతృప్తితో ఉన్నారు. అయినప్పటికీ పిల్లలతో జీవితాన్ని సంతోషంగా గడుపుతున్నామని అంటున్నారు ఈ దంపతులు.

పెద్దలను ఎదిరించి.. జీవితంలో గెలిచి



కుమారుడు, కుమార్తెతో అశ్విన్-శ్వేత దంపతులు

చౌటుప్పల్ : చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన గజం అశ్విన్‌కుమార్-శ్వేత దంపతులు ప్రేమించి వివాహం చేసుకున్నారు. 21 సంవత్సరాల క్రితం తొలిచూపులోనే వీరి ప్రేమ మొదలైంది. కులాలు వేరు కావడంతో 2005 మే 27న వీరు కుటుంబసభ్యులను ఎదిరించి స్నేహితుల సహకారంతో వివాహం చేసుకున్నారు. వీరి వివాహం తర్వాత ఇరు కుటుంబ సభ్యుల నుంచి మాటలు, రాకపోకలు సైతం నిలిచిపోయాయి. ప్రస్తుతం అశ్విన్ తరపు కుటుంబ సభ్యులు దగ్గరైనా.. శ్వేత కుటుంబసభ్యులు మాత్రం ఇప్పటికీ దూరంగానే ఉన్నారు. 18ఏళ్ల క్రితం వివాహం చేసుకున్న వీరికి ప్రస్తుతం కుమారుడు హర్ష, కుమార్తె సరయూ ఉన్నారు. కుమారుడు 9వ తరగతి, కుమార్తె 7వ తరగతి చదువుతున్నారు. పెళ్లయిన కొత్తలో వీరి సంసారం ఒడిదుడుకుల నడుమ సాగింది. సంవత్సరంపాటు హైదరాబాద్, మరో సంవత్సరంపాటు నల్లగొండ జిల్లా చిట్యాలలో అద్దె ఇంట్లో ఉన్నారు. తర్వాత తిరిగి చౌటుప్పల్‌కు చేరుకుని శ్వేత బ్యూటీషియన్‌లో శిక్షణ తీసుకుంది. అనంతరం తనే సొంతంగా బ్యూటీ పార్లర్‌ను ఏర్పాటు చేసుకుంది. కొద్ది రోజుల తర్వాత బ్యూటీ పార్లర్‌కు అనుబంధంగా లేడీస్ ఎంపోరియం ఏర్పాటు చేశారు. ఈ రెండు దుకాణాలను భార్య చూసుకుంటుండగా భర్త దుకాణ వ్యవహారాలతోపాటు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారాలు కలిసిరావడంతో వీరి కుటుంబం ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరింది. ఈ జంట ఇటీవలే స్థానికంగా చక్కటి ఇంటిని కొనుగోలు చేసింది. ఎంతో అన్యోన్యంగా జీవనం సాగిస్తున్న ఈ దంపతులు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

నమ్మకంలోనే నిజమైన ప్రేమ

నమ్మకంలోనే నిజమైన ప్రేమ ఉంది. మా తొలి చూపు నుంచి ఇప్పటి వరకు మా నడుమ ఎలాంటి మనస్పర్థలు రాలేదు. ఎంతో అన్యోన్యంగా ఉంటున్నాం. మా కుటుంబ సభ్యులు కోపంగా ఉన్న సమయంలోనూ అధైర్యపడలేదు. పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకున్నందున జీవితంలో గొప్పగా సాధించాలని అప్పుడే నిర్ణయించుకున్నాం. అనుకున్న మేరకు లక్ష్యాన్ని సాధించాం. ప్రస్తుతం మంచిగానే జీవనం సాగిస్తున్నాం. ఆర్థికంగానూ పెద్దగా సమస్యలేమీ లేవు.

– గజం అశ్విన్‌కుమార్ – శ్వేత, చౌటుప్పల్

ప్రేమకు పెద్దల ఆశీర్వాదం..



రమేష్, సునిత దంపతులు

కొండమల్లేపల్లి : ఈ ఫొటోలో కనిపిస్తున్న దంపతులు వాసికర్ల రమేష్, సునితారెడ్డి. వీరి ప్రేమకు వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో బీజం పడింది. నల్ల గొండకు చెందిన రమేష్ చిన్నతనంలోనే తండ్రిని కోల్పోవడంతో బంధువుల ఇంట్లో ఉంటూ 1994లో కాకతీయ యూనివర్సిటీలో ఎంఏ ఇంగ్లిష్‌లో చేసే సమయంలో తన జూనియర్ అయిన నిర్మల్‌కు చెందిన ఎంఏ తెలుగు చదువుతున్న సునితారెడ్డితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. వీరి ప్రేమను మొదట పెద్దలు అంగీకరించలేదు. తర్వాత వారిని ఒప్పించి 1996, జూన్ 6న పెళ్లి చేసుకున్నారు. అనంతరం రమేష్ కొండమల్లేపల్లిలోని ఓ ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్‌గా పని పనిచేశారు. 2002 ఎస్‌జీటీగా ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం గుడి తండాలో విధులు నిర్వహిస్తున్నాడు. కుమారుడు రాహుల్ రుషితో కలిసి ఆ దంపతులు సంతోషంగా జీనవం సాగిస్తున్నారు. ప్రేమకు పెద్దల ఆశీర్వాదం ఉంటే ఆ కుటుంబ జీవనం ఆనందమయం అవుతుందని చెబుతున్నాడు రమేష్.

కలిసిన మనసులు

అర్వపల్లి : వారిద్దరూ రెండేళ్లుగా ప్రేమించుకున్నారు. పెద్దలు అంగీకరించకపోయినా ఒక్కటై వివాహం చేసుకొని జీవితాన్ని సాఫీగా గడుపుతున్నారు. జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన వేముల విక్రమ్ హైదరాబాద్‌లో హెయిర్‌కటింగ్ సెలూన్‌ను నడుపుతూ మెదక్ జిల్లా రామాయంపేట మండలం రాయలపూర్ గ్రామానికి చెందిన మమతను ప్రేమించాడు. ఆమె బ్యూటీషన్‌గా పనిచేస్తూ విక్రమ్ ప్రేమను అంగీకరించింది. రెండేళ్లపాటు ఇద్దరు ప్రేమించుకున్నారు. వారిక పెళ్లిని ఇరుకుటుంబాల పెద్దలు అంగీకరించలేదు. దీంతో 2022 మార్చి 24న వారు పెళ్లి చేసుకున్నారు. ఇప్పుడు విక్రమ్ సూర్యాపేట జిల్లా కేంద్రంలో హెయిర్ కటింగ్ సెలూన్‌ను నడిపిస్తున్నారు. మమత బ్యూటీషన్‌గా పని చేస్తోంది. ప్రస్తుతం ఇరు కుటుంబాల వారు కలిసిపోవడంతో వారి సంసారం సాఫీగా సాగుతోంది.



వేముల విక్రమ్-మమత దంపతులు

రాజీ ధోరణితో బంధం బలపడుతుంది



రాజీ ధోరణితోనే వివాహ బంధం బలపడుతుంది. మేము ఉత్తర భారతదేశానికి చెందిన వారము. మానాన్న ఉద్యోగ రీత్యా మేము హైదరాబాద్‌లో స్థిరపడ్డాం. నేను ఉస్మానియా యూనివర్సిటీలో చదువుతున్న సమయంలో 25 సంవత్సరాల క్రితం మతాంతర వివాహం చేసుకున్నా. ఒకరికి కోపం వస్తే ఇంకొకరు తగ్గి ఉండడంతో మా బంధం బలంగా మారింది. స్థిరపడిన తర్వాత వివాహం చేసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– డాక్టర్ అపర్ణాచతుర్వేది, అధ్యాపకురాలు, ఉమెన్స్ డిగ్రీ కాలేజీ నల్లగొండ

ఆలయ అభివృద్ధికి కృషి

- హుజూర్‌నగర్ ఎమ్మెల్యే సైదిరెడ్డి

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ ఇష్ట కామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హుజూర్‌నగర్ ఎమ్మెల్యే సైదిరెడ్డి తెలిపారు. సోమవారం శివాలయంలో నిర్వహించిన రెనివేషన్ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆలయ అభివృద్ధికి రూ.50 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. జాతరకు నిర్వహించే ఎద్దుల పందేలకు కోటి రూపాయల ప్రైజ్‌లు అందిచనున్నట్లు తెలిపారు. ఇక్కడ జరిగే ఉత్సవాలకు విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఐటీ శాఖ ,పురపాలిక శాఖ మంత్రి కేటీఆర్ పాల్గొననున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఆయన శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జాతర ,ఎద్దుల పందేల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నూతన కమిటీ చైర్మన్ వల్రా వెంకటరెడ్డి, సర్పంచ్ శంకర్‌రెడ్డి, బాల వెంకట్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయ శర్మ, నర్సింహారెడ్డి, జనిగ సైదులు, గురుస్వామి, సైదిరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

లక్ష్యానికి మించి సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు

తుంగతుర్తి: సుకన్య సమృద్ధి యోజనను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వడ్లమూడి వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు తెరవడంలో సూర్యాపేట జిల్లా లక్ష్యాన్ని మించి ముందంజలో ఉందన్నారు. ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా సూర్యాపేట డివిజన్ పరిధిలో సుకన్య సమృద్ధి పథకంపై ఈనెల9, 10 తేదీల్లో ప్రత్యేక డ్రై వ్ నిర్వహించి 1,615 ఖాతాలు తెరవాలని లక్ష్యంగా పెట్టుకోగా జిల్లాలోని పోస్టల్ సిబ్బంది సహకారంతో రెండు రోజుల్లో 1,652 ఖాతాలు తెరిచినట్లు తెలిపారు. దేశంలో ఏ పథకానికి లేని విధంగా సుకన్య సమృద్ధి యోజన ఖాతాకు 7.6శాతంతో వడ్డీ లభిస్తుందన్నారు.

చికెన్ వ్యర్థాల తరలింపు వాహనం పట్టివేత

బీబీనగర్: హైదరాబాద్ నుంచి ఏపీకి చికెన్ వ్యర్థాలను రవాణా చేస్తున్న వాహనాన్ని బీబీనగర్ పోలీసులు ఆదివారం రాత్రి గూడూరు టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్నారు. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీకిలోని అద్దంకికి చెందిన ఘంటసాల సూరి, ఏలూరుకు చెందిన బాలే నాగరాజు, మెగ్గ దుర్గారావు, ఘంటసాల వెంకన్నబాబులు హైదరాబాద్‌లోని చాంద్రాయాణగుట్టకు చెందిన సయ్యద్ ఇర్ఫాన్ మద్దతుతో చికెన్ వ్యర్థాలాను లోడ్ చేసుకొని గూడూరు టోల్‌ప్లాజా గుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తరలిస్తున్నారు.సమాచారం మేరకు పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తహసీల్దార్‌పై కలెక్టరేట్‌లో ఫిర్యాదు

ఆలేరురూరల్ : ఆలేరు తహసీల్దార్ రామకృష్ణ కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై ఎలాంటి అనుమతులు ఇవ్వకుండా దాదాపు 200 ట్రాక్టర్ ఇసుకను అక్రమంగా తరలించి సమీకృత మార్కెట్ ముందు డంపింగ్ చేశారని బీజేపీ నాయకులు బందెల సుభాష్, వడ్డెమాన్ కిషన్ సోమవారం కలెక్టరేట్‌లో ఏఓ నాగేశ్వరావుకు ఫిర్యాదు చేశారు. ఇసుక డంపింగ్‌పై ఆర్‌టీఐపై ఫిర్యాదు చేసి 2 నెలలు గడిచినా ఇంతవరకు సమాచారం ఇవ్వలేదన్నారు.

ఆలయంలో చోరీ

భువనగిరి : గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన పట్టణ శివారులోని శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ఆదివారం జరిగింది. ఆలయం ఈఓ, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియన వ్యక్తులు హుండీని పగుల గొట్టి చోరీకి పాల్పడ్డారు. సోమవారం స్థానికులు గమనించి నిర్వహకులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీసీ పుటేజీలను పరిశీలంచడంతో ఇద్దరు వ్యక్తులు చోరీకి పాల్పడుతున్నట్లు కనిపించింది. 40 రోజులకు సంబంధించి భక్తులు సమర్పించిన నగదు సుమారు రూ. 2 లక్షలు, అర కిలో వెండి, 5 గ్రాముల బంగారం అపహరణకు గురైనట్లు తెలిపారు.

మార్చినాటికి ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం పూర్తి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన ఆయిల్‌పామ్ సాగులక్ష్యాన్ని మార్చినాటికి పూర్తి చేయాలని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి బెల్లంకొండ శ్రీధర్ గౌడ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని జిల్లా ఉద్యాన శాఖ కార్యాలయంలో ఆయిల్ పామ్, డ్రిప్ కంపెనీల సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పతంజలి పుడ్స్ లిమిటెడ్ ఆయిల్ పామ్ కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ బి.యాదగిరి, ప్రాంతీయ ఉద్యాన అధికారులు కన్న జగన్, స్రవంతి పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీకి పతనం తప్పదు

సూర్యాపేట రూరల్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించకుండా మోసం చేస్తున్న బీజేపీకి తెలంగాణ రాష్ట్రంలో పతనం తప్పదని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మందకుమార్ మాదిగ, మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్‌గౌడ్ హెచ్చరించారు. మాదిగ ఉపకులాలను మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ యాతాకుల రాజన్న మాదిగ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని టేకుమట్ల వద్ద హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని దిగ్బంధం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే 100రోజుల్లో ఎస్సీ రిజర్వేషన్లు, వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి విస్మరించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చింతలపాటి చిన్నశ్రీరాములు, బొజ్జ సైదులు, మందరాజు, నరసన్న, మహేందర్,విజయ, రవి, వెంకన్న పాల్గొన్నారు.



టేకుమట్ల వద్ద జాతీయ రహదారి దిగ్బంధం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలి

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశ పెట్టాలని మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లగుండ్ల సోమయ్య కోరారు. సోమవారం తిరుమలగిరిలో మాదిగ ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వర్గీకరణ బిల్లు ప్రవేశ పెడతామని చెప్పి తొమ్మిది సంవత్సరాలైనా హామీ అమలు చేయలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశ పెట్టకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో జానకిరాములు, జాన్ విల్సన్, కృష్ణ, ప్రభాకర్, రమేష్, శ్యాం, గోపి, ఉపేందర్, సైదులు, పర్వతాలు, నాగయ్య, యాదయ్య పాల్గొన్నారు.



తిరుమలగిరిలో మాట్లాడుతున్న సోమయ్య

పంచాయతీలో 'రేషన్'

నాంపల్లి : గ్రామ పంచాయతీ భవనం రేషన్ దుకాణంగా మారింది. మండలంలోని ముష్టిపల్లి పంచాయతీ భవనంలో ఎలాంటి అనుమతులు లేకుండా రేషన్ దుకాణం ఏర్పాటు చేశారు. పంచాయతీలో కార్యదర్శి, సర్పంచ్‌కు సరిపడా గదులు లేక రికార్డులు, బీరువాలు, పర్నిచర్ ఉంచడానికి ఇబ్బందిగా ఉండగా.. అదే కార్యాలయంలో రెండేళ్లుగా రేషన్ దుకాణం ఏర్పాటు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రేషన్ దుకాణం వేరే భవనంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పంచాయతీ కార్యాలయంలో నడుస్తున్న రేషన్ దుకాణం

అదానీ కుంభకోణాలపై విచారణ జరిపించాలి

నల్లగొండ టౌన్: అదానీ కుంభకోణాలపై వెంటనే విచారణ జరిపించాలని, దేశ ఆర్థిక సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ జాతికి క్షమాపణ చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదుట ఆ పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ప్రధాని మోదీ అండదండలతో ప్రపంచంలోనే రెండవ కుబేరుడిగా అదానీ ఎదిగారని అన్నారు. ఎల్ఐసీని రూ.40 వేల కోట్ల నష్టాల్లోకి నెట్టివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్, పల్లా దేవేందర్‌రెడ్డి, పబ్బు వీరస్వామి, బొలుగూరి నర్సింహ, బంటు వెంకటేశ్వర్లు, టి.వెంకటేశ్వర్లు, అంజాచారి, గిరి, రాము, మైనుద్దీన్, బరిగల వెంకటేష్, నూనె రామస్వామి, ఎండీ.జహంగీర్, చాపల శ్రీను పాల్గొన్నారు.



ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ప్రారంభానికి భవనాలను సిద్ధం చేయాలి

భువనగిరిటౌన్ : ప్రారంభానికి భవనాలను సిద్ధం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశించారు. సోమవారం భువనగిరి పట్టణంలోని నూతనంగా నిర్మిస్తున్న వెజ్‌నాన్ వెజ్ సమీకృత మార్కెట్ భవనం, జిల్లా గ్రంథాలయ సంస్థ భవనం, 9వ వార్డులోని కమ్యూనిటీ హాల్ భవనం, నిరాశ్రయుల వసతి భవనం పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.నాగిరెడ్డి, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి అండాళు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.